Bandi Sanjay Kumar, M.P
President

Bharatiya Janata Party
Telangana

తేది 24.09.2021

గౌరవనీయులైన శ్రీ కె. చంద్రశేఖరరావు గారికి
తెలంగాణ ముఖ్యమంత్రి
ప్రగతి భవన్, హైదరాబాద్.

నమస్కారం...

విషయం:- రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, రైతు రుణమాఫీ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ వినతి.

"ప్రజాసంగ్రామ యాత్ర"లో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో గత 25 రోజులుగా నిర్వహించిన పాదయాత్రలో వేల మంది రైతులు స్వయంగా వచ్చి మమ్మల్ని కలిసి **"రైతు రుణమాఫీ"** అమలు కావడం లేదని తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఇంతే కాకుండా వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ముఖ్యంగా గిట్టుబాటు ధర, ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం అమలు చేయకపోవడం, 2014, 2018 ఎన్నికల సందర్భంగా మీరు, మీ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంపై వారు ఆవేదన చెందుతున్నారు.

"రైతులకు లక్ష రూపాయల వరకున్న పంట రుణాలను మాఫీ చేయడం జరుగుతుంది" అని 2018 ఎన్నికల సందర్భంగా మీరు, టీఆర్ఎస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం మీకు విదితమే. 2018 అసెంబ్లీ ఎన్నికల నాటికి **42 లక్షల** మంది రైతులు చెల్లించాల్సిన **28 వేల కోట్ల** రూపాయల పంట రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని మీరు ఈ సందర్భంగా ఇచ్చిన హామీని మీకు గుర్తు చేయదల్చుకున్నాం.

మీరు లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇంకో మూడు నెలల్లో మూడు సంవత్సరాలు పూర్తి కావొస్తుంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక విడత మాత్రమే, 25 వేల రూపాయల లోపు ఉన్న **2.96 లక్షల** మంది రైతుల రుణాలను **408 కోట్ల** రూపాయలను మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకుంది.

☎ Off : 040-24653535, 24653311, Fax : 040-24653929, E-mail : bjptgonline@gmail.com
Off : Dr. Shyamprasad Mukkherjee Bhavan, Opp. Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.
M.P Off : # 2-10-1525, Jyothinagar, Karimnagar - 505 001, E-mail : bandisanjayindian@gmail.com

రాష్ట్రంలో ఇంకా **39 లక్షల మంది రైతులకు 27 వేల 500 కోట్ల రూపాయలు మాఫీ చేయాల్సి ఉంది.** ఆగస్ట్ నెలలో మీరు 50 వేల రూపాయల లోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారు. అయినా అది పూర్తిగా అమలు కాలేదు. రైతులకు రుణమాఫీ కాకపోవడం వల్ల రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయకపోవడం వల్ల బ్యాంకులు అనేక చోట్ల రైతుబంధు పథకం కింద ప్రభుత్వం ఇచ్చిన సొమ్మును పాత బకాయిల కింద బ్యాంకులు జమ చేసుకుంటున్నాయి. రైతు బంధు సొమ్ము రైతులకు ఉపయోగపడకుండా పోతున్నా, మీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నది. ఈ పరిస్థితి రావడానికి మీరు, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రధాన కారణం.

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్క రైతుకు దాదాపు లక్షన్నర రూపాయలు రుణాలు బకాయిలు ఉన్నారని ప్రముఖ సంస్థ నిర్వహించిన సర్వే నివేదికలో తేలింది. దీని ప్రకారం మీరు మాఫీ చేస్తానన్న రైతు రుణమాఫీ ఏ విధంగా అమలవుతుందో తేటతెల్లం అవుతోంది.

రాష్ట్రంలో తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే 2018 ఎన్నికల్లో మీరు హామీ ఇచ్చిన ప్రకారం లక్ష రూపాయల రుణ మాఫీని వెంటనే అమలు చేసి **మిగిలిన 38 లక్షల రైతులను** ఆదుకోవాలని బీజేపీ తెలంగాణ శాఖ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

## వరి పంట వేయొద్దనడం దుర్మార్గం?

మీరు ఇటీవల వచ్చే యాసంగిలో వరి పంట వేయ్యొద్దని... వరి వేస్తే.. ఉరే అని ప్రకటించారు. మీ ప్రకటనతో రాష్ట్రంలోని రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం పై మీరు నిందలు వేయడం మీకు తగదు. ప్రతి నిత్యం మీరు, మీ పార్టీ వారు అన్ని పథకాలకు నిధులను మంజూరు చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం వాటా ఇందులో నామమాత్రం అని గోబెల్స్ ప్రచారం చేశారు. వాస్తవానికి ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న అన్ని పథకాలు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న అధిక నిధులతోటే అమలవుతున్నాయి.

గత ఏడు సంవత్సరాలుగా మీరు మీ పార్టీ వారు తెలంగాణలో పండే పంటనంతా మేమే కొంటాం, పొలం దగ్గరకు వచ్చి ప్రతి గింజా కొంటాం, 48 గంటల్లో రైతుల అకౌంట్లలో డబ్బులు వేస్తాం.. అని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిన మీరు, మీ పార్టీ వారు కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టి వరిని వేయవద్దని రైతులను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం. మీ అసమర్థత వలన రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు.

ఇటీవల మీరు వారం రోజుల పాటు ఢిల్లీలో ఉండి ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ గారిని, ఇతర కేంద్ర మంత్రులను కలిసినప్పుడు అత్యంత ప్రాధాన్యమైన ఈ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదు?ఢిల్లీ పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత వరి వేయొద్దని మీరు ఎందుకు ప్రకటన చేశారు? స్వదేశీ పంటల ఉత్పత్తులను విదేశాలకు మార్కెటింగ్ చేసేందుకు ఢిల్లీలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసినప్పుడు మీరు ఎందుకు హాజరు కాలేదు? దీన్ని బట్టే మీకు రైతుల పట్ల ఉన్న ప్రేమ, బాధ్యత తేటతెల్లమవుతోంది.

మీరు, మీ పార్టీ వారు పూటకో ప్రకటన చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారు. గతంలో మీరే దొడ్డు రకాలు వేయకూడదని, సన్నాలు వేయాలని ప్రకటించారు. ఇప్పుడు వరి పంట వేయొద్దని, వేస్తే ఉరే అని అంటున్నారు. పూటకో మాట మాట్లాడడం మీకు, మీ పార్టీ వారికి తగదు. వరి వేయొద్దని అనడం సరైన నిర్ణయం కాదు. కాలువ కింద, వరి మడుగులో వరి తప్ప ఇంకేమీ పండదు. ఈ విషయం మీకు తెలిసి కూడా వరి వేయొద్దని ప్రకటించడం రైతులను మీ మాటలతో ఉరి తీయడమే. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన వరి పంటను గిట్టుబాటు ధర కల్పించి, ప్రతి గింజా కొనేవరకు తెలంగాణ బీజేపీ శాఖ రైతులకు అండగా నిలబడుతుంది. ఇప్పటికైనా మీరు, మీ పార్టీ వారు ఇష్టమొచ్చినట్లు ప్రకటనలు చేసి వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీయొద్దని కోరుతున్నాం.

## రైతుల ఆత్మహత్యలు

రాష్ట్రంలో ఇప్పటికే 28,500 రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ప్రభుత్వ అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. మీ హయాంలో 2018-19లో 17,845 మంది, 2019-20లో 19,351 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైతుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా, వారికి మనోస్థైర్యాన్ని కల్పించాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ శాఖ తరపున కోరుతున్నాం.

## ఉచిత ఎరువులు ఏమయ్యాయి?

2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉచితంగా ఎరువులు ఇస్తామని మీరు ఇచ్చిన హామీ ఈ సందర్భంగా గుర్తు చేయదల్చుకున్నాం. ఈ మూడు సంవత్సరాల కాలంలో ఒక్క రైతుకు కూడా బస్తా ఎరువును ఉచితంగా ఇచ్చింది లేదు. మీరు ఇచ్చిన హామీ ప్రకారం కనీసం వచ్చే యాసంగి కాలం నుంచైనా రైతులకు ఉచితంగా ఎరువులు ఇచ్చి మీ హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నాం.

## మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి – కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

"ప్రజాసంగ్రామ యాత్ర"లో రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడం లేదని అనేక చోట్ల ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఇప్పుడిప్పుడే మొక్కజొన్న పంట చేతికొస్తున్నది. రాష్ట్రంలో 6 లక్షల, 31 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. ప్రభుత్వం ఇప్పటివరకు మొక్కజొన్న పంట కొనుగోళ్లపై విధానపరమైన ప్రకటన చేయకపోవడంతో రైతులు దళారులు చేతుల్లో మోసపోతున్నారు. **మొక్కజొన్నల మద్ధతు ధర రూ. 1870 ఉంటే,** ప్రస్తుతం మార్కెట్‌లో దళారులు **రూ. 1600 మించి కొనడం లేదు**. మొక్కజొన్న పంట ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి వస్తోంది. ఇప్పుడే రూ. 1600 ఉంటే, పూర్తిస్థాయిలో పంట చేతికి వచ్చి మార్కెట్‌కు తరలిస్తే ధర ఇంకా పడిపోయే అవకాశం ఉంది. మొక్కజొన్న రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ బీజేపీ శాఖ తరపున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

## ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం అమలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత మూడు సంవత్సరాలుగా పంట నష్టపోయిన రైతులకు అందాల్సిన **960 కోట్ల రూపాయల పరిహారం** విడదల కాలేదు. పరిహారం కోసం రైతులు ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద చెల్లించాల్సిన తన వాటా మొత్తం **413.50 కోట్ల రూపాయలను** చెల్లించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ బీజేపీ శాఖ తరపున కోరుతున్నాం.

## భూసార పరీక్షల నిధులు ఏమయ్యాయి?

కేంద్ర ప్రభుత్వం భూసార పరీక్షల కోసం **126 కోట్ల రూపాయలను** మంజూరు చేస్తే ఒక్క గ్రామంలో కూడా భూసార పరీక్షలు చేయలేదు. కేవలం మీ ఫాం హౌజ్‌లోనే భూసార పరీక్షలు నిర్వహించినట్లు అనేక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీనిపైన మీరు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన భూసార పరీక్షల నిధులను పక్కదారి పట్టించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను వెంటనే భూసార పరీక్షలకు ఉపయోగించాలని, రైతులకు మేలు చేయాలని కోరుతున్నాం.

**ధరణిలో అక్రమాలు అరికట్టాలి**

రాష్ట్రంలో ధరణి పేరుతో రైతుల భూములు లాక్కుంటున్నారని, పట్టా పాస్‌బుక్‌లు ఇవ్వడం లేదని ప్రజాసంగ్రామ యాత్రలో అనేక మంది రైతులు వచ్చి మాకు ఫిర్యాదు చేశారు. రికార్డులను ప్రక్షాళన చేసి పట్టా పాస్‌బుక్‌లు ఇస్తామని అర్భాటంగా ప్రకటించిన మీ ప్రభుత్వం రైతులకు పట్టా పాస్‌బుక్‌లు ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 23 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో చేర్చారు. ధరణి పూర్తిగా దుర్వినియోగం అవుతోంది. రైతుల పాలిట యమపాశంగా మారింది ఈ కార్యక్రమం. మీరు వెంటనే ఈ విషయంపై దృష్టి సారించి రైతులకు పట్టా పాస్‌బుక్‌లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, అక్రమాలను అరికట్టాలని కోరుతున్నాం.

పైన పేర్కొన్న సమస్యలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవడానికి ఈ కింద చర్యలను చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ శాఖ తరఫున డిమాండ్ చేస్తున్నాం.

- **2018 ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం లక్ష రూపాయల రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలి.**
- **రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ కింద ఇంకా ఇవ్వాల్సిన 27 వేల 500 కోట్ల రూపాయల నిధులను వెంటనే విడుదల చేయాలి.**
- **వరి పంట వేయొద్దన్న ప్రకటనను బేషరతుగా ఉపసంహరించుకోవాలి. రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి.**
- **ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వాటా సొమ్మును 413.50 కోట్ల రూపాయలను చెల్లించి రైతులను ఆదుకోవాలి.**
- **రాష్ట్రంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలపై విచారణ జరిపించి, వాటి నివారణకు చర్యలు చేపట్టాలి.**
- **మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలి.**
- **రైతులకు పట్టాదార్ పాస్‌బుక్కులను మంజూరు చేయాలి. ధరణిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలి.**

రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే రైతులకు అండగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ శాఖ నిలబడి వారి తరఫున పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా మీకు గుర్తుచేయదలిచాం.

**బండి సంజయ్ కుమార్,** ఎంపీ

**అధ్యక్షులు, బీజేపీ, తెలంగాణ రాష్ట్ర శాఖ**